

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**తూ ఛుపీ హై కహా, మై తడప్‌తా యహా**

**తేరె బిన్ ఫీకా ఫీకా హై దిల్‌కా జహాన్**

**తూ గయా ఉడ్ గయా రంగ్ జానే కహా**

**తూ ఛుపీ హై కహా, మై తడప్‌తా యహా**

'నవరంగ్ ' సినిమాలో మన్నాడే, ఆశాబోన్స్‌లేలు పాడిన ఈ పాటతో 'నవరంగ్' సినిమా ముగుస్తుంది.

సినిమాను పాటతో ముగించటం శాంతారాం సంతకంలాంటిది. నవరంగ్ సినిమాలో ఈ పాటతో సస్పెన్స్ విడివడుతుంది. ప్రేక్షకులు నిట్టూర్పు విడుస్తారు. ఇంతకీ నవరంగ్ సినిమాలో సస్పెన్స్ ఏమిటంటే, కవి అయిన నాయకుడు కలవరించి, పలవరించి తన కవితలలో ప్రదర్శించే 'మోహిని' ఎవరన్నది. మోహిని అనే ఆమె ప్రేమలో తన భర్త తనని పట్టించుకోవటంలేదని అలిగి అతని భార్య అతడిని వదిలి వెళ్లిపోతుంది. అప్పటినుంచీ కవి జీవితంలో దుర్దశ మొదలవుతుంది. అతని సృజనాత్మక స్రవంతి కదలిక ఆగిపోతుంది. కవితలు అల్లలేక పిచ్చివాడై తిరుగుతూంటాడు. ఆ సంస్థానం రాజు కవి హృదయం గ్రహిస్తాడు. నిండు సభలో అతడిని కవితాగానం చేయమంటాడు. కానీ ఇప్పుడు అతడి హృదయం మోహినీ రహితం. సృజనాత్మకత శూన్యం అయిపోయింది. కవితను సృజించలేకపోతాడు. రాజు అతడిని శిక్షించమని ఆజ్ఞాపిస్తాడు. భటులు అతడిని పట్టుకుని వెళ్తూంటే అతడికి మోహిని పదధ్వని వినిపిస్తుంది. ఆమె అక్కడే ఎక్కడో ఉంది. తనతో దాగుడు మూతలాడుతోంది అనిపిస్తుంది. ఆవేదన కవిత రూపంలో ఉబికి ఉబికి వస్తుంది.

'నీకోసం నేను అలమటిస్తూంటే, నువ్వెక్కడ దాక్కున్నావు. నువ్వు లేక నాకు జీవించాలనే ఇచ్ఛ నశించింది. జీవితం మీద ఆసక్తిపోయింది. నువ్వు వెళ్లిపోవటంతో జీవితంలో ఆనందం ఎగిరిపోయింది. నేను నీ కోసం ఇక్కడ తపిస్తూంటే, నువ్వెక్కడ దాక్కున్నావు' అంటూ కవితాగానం ఆలపిస్తాడు.

పాటలో పదాలు, కవితలో లయను గమనిస్తే బాణీ దానంతట అదే వస్తుంది. భరత్ వ్యాస్ వాడిన పదాలు రెండు వైపులా పదునైన కత్తుల్లాంటివి. హృదయపు ప్రపంచం ఆమె లేకపోతే 'ఫీకా, ఫీకా' గా ఉందట. ఫీకా అంటే రుచి లేకపోవటం, అన్న అర్ధం వస్తుంది. ఫీకా అంటే తేజ రహితం, కాంతి విహీనం అన్న అర్ధం వస్తుంది .ఫీకా అంటే వ్యర్ధమవటం అన్న అర్ధం కూడా వస్తుంది. రంగు వెలిసిపోవటం అన్న అర్ధం కూడా ఉంది. ఇక్కడ ఏ అర్ధం తీసుకున్నా సినిమాలో కవి హృదయాన్ని సరిగ్గా ప్రతిబింబిస్తుంది. అయితే, తరువాత వాక్యంలో 'తూ గయీ ఉడ్ గయా రంగ్ జానే కహా' అనటంతో ఎంత తీవ్రమైన వేదనను కవి అనుభవిస్తున్నాడో తెలుస్తుంది. అతని జీవితంలోంచి రంగు ఎగిరిపోయింది' అన్నది సామాన్యార్ధం. 'రంగు' అన్నది ఆనందానికి సంకేతం. ఆమె లేక అతని హృదయ ప్రపంచం కాంతి విహీనం అయింది. అతనికి అన్నిటిమీదా ఆసక్తిపోయింది. జీవితంలోంచి ఆనందం ఎగిరిపోయింది. కవిత అతడిని వదలిపోయింది. సృజనాత్మక కళాకారుడికి తాను కళను సృజించలేకపోవటం అసలు మరణం. భౌతిక శరీరం నశించటం అతనికి బాధాకరం కాదు. కళను సృజించలేకపోవటమే మరణం. కళను సృజించలేని కళాకారుడు జీవచ్చవంతో సమానం. జీవచ్చవం బ్రతికివుంటే ఏమిటి? లేకపోతే ఏమిటి?

ఒక సృజనాత్మక కళాకారుడి అంతరంగాన్ని ఇంత గొప్పగా ఆవిష్కరించిన సినిమా మరొకటి లేదు.

కళాకారుడు కూడా మాములు మనిషిలాంటివాడే, కేవలం కళను సృజించే సమయంలో మాత్రమే అతను కళాకారుడు. మామూలు మనుషులకు భిన్నం. అతని ప్రపంచం మామూలు మనుషుల ప్రపంచం కాదు. అది సామాన్యులకు అర్ధంకానీ, ఊహకు కూడా అందని అత్యద్భుతమైన సృజనాత్మక ప్రపంచం. అందుకనే, కళాకారులను మామూలు మనుషులు పిచ్చి వాళ్లుగా పరిగణిస్తారు. బ్రతకటం చేతకాని వాళ్లుగా అభివర్ణిస్తారు. కళాకారుల బాధ అందరికీ హాస్యాస్పదంగా ఉంటుంది. వెక్కిరింతగా ఉంటుంది. కళాకారుడికి జీవన్మరణ సమస్య, ఇతరులకు పనికిరానిదిగా అనిపిస్తుంది.

'ప్యాసా' సినిమా ఆరంభ దృశ్యం కళాకారుడి అంతరంగాన్ని అతి గొప్పగా ప్రదర్శిస్తుంది. హీరో ఓ తోటలో పడుకుని ఉంటాడు. పువ్వులను చూసి ఆనందిస్తూంటాడు. తోటలోని రంగు రంగుల పూలను, ప్రతిఫలిస్తున్న వెలుతురును చూసి సంతోషిస్తూంటాడు. పూల రసాన్ని పీలుస్తూ ఒక పూవు మంచి మరో పూవుకు ఎగిరే భ్రమరాన్ని చూసి ఉత్సాహవంతుడవుతాడు. ఇంతలో ఆ తుమ్మెద నేల వాలగానే ఓ దారే పోయేవాడు దాన్ని తొక్కివెళ్లిపోతాడు. మన కవికి కోపమొస్తుంది. ఏడుపు వస్తుంది. 'ఓ అందమైన ప్రకృతి నీకు నేనేమివ్వగలను? కన్నీళ్లు, నిట్టూర్పులు తప్ప' అని ఈసడించి, కోటు దులుపుకుని భుజాన వేసుకుని వెళ్లిపోతాడు. ఇది అర్ధంలేని దృశ్యంలా పలువురు ఆ కాలంలో

విమర్శించారు. తుమ్మెదను తొక్కి వెళ్లిపోయేవాడికి తుమ్మెద కనిపించలేదు. వాడి దోషం కాదది. దానికి కవికి ఎందుకు కోపం రావాలి? కవికి ఆవేశం ఎందుకు రావాలి? అర్ధంలేని ఆక్రోశం అది అనిపిస్తుంది.కవికి తుమ్మెద తుమ్మెద కాదు. అందరికీ తుమ్మెద కనిపిస్తుంది. కవి స్వేచ్ఛగా తిరిగే ఆత్మ కనిపిస్తుంది. తొక్కేసిన పాదం వ్యక్తి స్వేచ్ఛను హరించే దుష్ట శక్తి అనిపిస్తుంది. అది కవి దృష్టి. అందుకే, ఒక విగ్రహమూర్తిని ఎదురుగా పెట్టుకుని, ఆ మూర్తిలో ప్రేయసిని దర్శించి ఆమె సౌందర్యంతో ప్రేరణపొంది కవితను కవి సృజించగలడు. సామాన్యుడికి ఇదీ అర్ధంలేనిదే.

నా భావనలో. నా సాధనలో

నాట్యము చేసే రాణివో,

ఎవరివో, నీవెవరివో…

దివినే వదలి, భువికేతెంచిన

తేనెల వెన్నెల సోనవో,

కవితావేశమే కలలై అలలై

కురిసిన పూవుల వానవో

ఎవరివో నీ వెవరివో

నవ వసంతమున నందన వనమున

కోయిల పాడిన పాటవో

వలపు కొలనులో కలకల విరిసిన

కలువల కన్నుల కాంతివో

ఎవరివో, నీవెవరివో…

ఇంత అద్భుతమైన కవితాగానానికి ప్రేరణ 'సజీవ శిల్ప సుందరి'. ఆశిల్పం అగ్నికి ఆహుతి అయితే ఆ కవి పిచ్చివాడైపోతాడు. చూసేవారికి, వినేవారికి హాస్యాస్పదంగా తోస్తుంది. విగ్రహాన్ని ప్రాణంవున్న మనిషిలా భావించటమే హాస్యాస్పదమయితే, అది కాలిపోయిందని పిచ్చివాడవటం పిచ్చికి పరాకాష్ట. కానీ సున్నిత హృదయుడైన సృజనాత్మక కళాకారుడికి అది ప్రాణం లేని శిల్పంకాదు. సజీవమైన ప్రేమమూర్తి. ఇతరులకు అది నిర్జీవమైన శిల్పం. ఇతరులకు నిర్జీవంగా తోచే శిల్పంలో సజీవమైన ప్రేయసిని దర్శించగలగటం కళాకారుడి ప్రత్యేకత. అది అతడి ప్రపంచం. ఈ సున్నితమైన భేదాన్ని అతి గొప్పగా చూపుతుంది 'నవరంగ్ ' సినిమాలో ఈ చివరి పాట.

సినిమాలో మొదటినుంచీ కవి అంతరంగానికి సంబంధించి, దాన్ని అర్థం చేసుకునే ఆధారాలు మనకు లభిస్తూనే ఉంటాయి. నాయిక కోపంతో వెళ్లిపోతుంది. మోహినీ వెళ్లకు' అంటూ హీరో కలల లోకంలో తన ప్రేయసిని బ్రతిమలాడతాడు. కవిత రాయాలి. మోహిని నృత్యం చేస్తూంటుంది. ప్రేరణ లభిస్తుంది. నాయిక అన్నం వడ్డిస్తూంటూంది. అతడికి మోహిని కనిపిస్తూంటుంది. అంటే, అతడు తన భార్యలోనే ఊహా సుందరిని దర్శిస్తూ, నిజ జీవితంలో ఆమెకన్నా భిన్నంగా, ఊహాలోకంలో మోహినిని ఊహిస్తూ ప్రేరణ పొందుతున్నాడన్నమాట. అతడి ఊహా ప్రేయసికి ఆధారం నిజజీవితంలోని భార్య.

నిజ జీవితంలో ఆమె అతడి ముందుకు రాదు. ముఖంపై ముసుగు వేసుకుని ఉంటుంది. చిరునవ్వు ఉండదు. కానీ ఊహా లోకంలో ఆమె చంచల శీలి. చిలిపి. నాట్యగత్తె.

**అటక్ అటక్ ఝట్ పట్ పన్‌ఘట్ పర్**

**చటక్ మటక్ ఎక్ నార్ నవేలీ**

**గోరీ గోరీ గ్వాలన్ కీ ఛోరీ చలీ**

**చోరి చోరీ ముఖ్ మోరి మోరి ముస్కాయే అల్బేలీ**

**కంకరి గలే మే మారి కంకరి కన్హయ్యానే**

**పకడీ బాహ ఔర్ కీ అట్‌ఖేలీ**

**భరీ పిచ్ కారీ మారీ**

స ర ర ర ర ర ర

భోలీ పనిహారీ బోలీ

పదాల వాడకం అద్భుతం. శుద్ధ హిందీ పదాలలోని లయ, ప్రాస, సరళత్వాన్ని లాలిత్యాన్ని అత్యద్భుతంగా, ప్రదర్శిస్తాయీ పంక్తులు. ఇంతకీ కవి వర్ణిస్తున్నది ఓ గోపిక నీళ్ళబిందెతో నది దగ్గరకు వచ్చి నీళ్లు నింపుకుని వస్తూంటే ఆమె పైకి శ్రీకృష్ణుడు రాళ్లు విసిరాడు. హోలీ ఆటకోసం నిండిన పిచ్‌కారీతో ఆమెపై రంగు నీళ్లు వెదజల్లాడు. అప్పుడా గొల్లపిల్ల అతడిని తిడుతుంది.

అరే జారె హట్ నట్ ఖట్

న చూరే మెర ఘూంఘట్

పలట్ కె దూంగీ ఆజ్ తుఝే గాలీ రే

ముఝే సంఝోన తుం భోలే భాలీ రే

మళ్లీ పద ప్రయోగం గమనించండి. 'హట్' అంటే పక్కకు జరుగు, పోరా అనే అర్థాలు వస్తాయి. 'నట్‌ఖట్' అంటే అల్లరి చేసేవాడు. పక్కకు జరుగు అల్లరివాడా, పోరా పోకిరీవాడా అనుకోవచ్చు కానీ ముందు 'జారే అంటే 'పోరా' అంది. అందుకని రెండవ పాదంలో , చూరే ' నన్ను తాకకురా.. 'మెరా' ఇలా ఈ 'ట 'కార ప్రయోగానికి 'ర ' కార ప్రయోగం తోడయి పాటకు అందం వచ్చింది. ఆరంభంలో కూడా 'అటక్, అటక్ ' ఝట్ పట్, నట్ ఖట్, చటక్, మటక్' అంటూ 'ట' కార ప్రయోగం అతి సుందరంగా వినిపిస్తుంది. ఆపై గోరీ గోరీ చోరీ చోరీ, మోరి మోరి, కంకరి మారి, భరీ, మారీ, పనిహారీ, ఈ పదాలు ఇలా లయబద్ధంగా వస్తూంటే 'అర్థం'తో సంబంధం లేకుండా మనసు ఆనంద పరవశమయి సంతోష సాగరాలలో మునకలు వేస్తుంది. ఏమి రచనా పద్ధతి ఇది! అదీ వ్యాపార పరంగా సమస్త సమాజాన్ని తరతరాలుగా అలరిస్తున్న సినిమా పాటలో ఈ పదాలు.. పరమాద్భుతమైన కళాకారులు వారు. ఈ పాట వింటూంటే 'క్షోణి తలమ్మునన్ నుదురు సోకగ' పద్యం మదిలో మెదలుతుంది. సైకత శ్రోణి, సుందరవేణి,రక్షితామర శ్రేణి, వాణి, వానికి నక్షదామ శుక వారిజ రమ్య పుస్తక పాణి లాంటి పద ప్రయోగాలు, 'భూషణము, వాణికి నఘ పేషణములు' వంటి పద్యాలు, గుర్తుకువస్తాయి. 'మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్ ' అంటే ఏమిటో బోధ పడుతుంది.

**చరణ కింకిణులు ఘల్లు ఘల్లుమన**

**కర కంకణములు గలగల లాడగ**

**వినీల కచభర విలాస బంధుర**

**తనూలతిక చంచలించిపోగా...**

భాష ఏదయినా, భావం ఏదయినా, పదాల వాడకంతో మనసును ఉద్రూతలూగించవచ్చు, బ్రహ్మానందాన్ని అనుభవానికి తెప్పించవచ్చు అనిపిస్తుంది. ఇలాంటి పాటలలో పదప్రయోగాల సౌందర్యాన్ని అనుభవిస్తూంటే.

**నా భావనలో నా సాధనలో**

**నాట్యము చేసే రాణివో**

అన్న పదాలలోని భావ లాలిత్య సౌందర్యం మనసుకు రెక్కలనిచ్చి వినీలాకాశంలో విహరింప చేస్తే

**నీ కరకంకణ నిస్వనమా, అది వాణీ వీణా నినాదమా?**

**నీ కరనూపుర నిస్వనమా, అది జలధి తరంగ మృదంగ రావమా?**

అన్న పదాలలో పద ప్రయోగాలలోని లయ, ప్రాసలో ఆ విశాలాకాశంలో విపరీతంగా వీస్తున్న వాయుతాడనానికి ఉక్కిరి బిక్కిరవుతూ కూడా ఆనంద పరవశమయిన భావనను కలిగిస్తుంది.

ఇది ప్రతిభావంతులయిన కవులు, పదాల శక్తి తెలిసిన కవులు, శబ్దాలలో ఒదిగిన బీజాక్షర శక్తి ప్రభావాన్ని ఎరిగిన కవులు, శబ్దాల తరంగాలు మానవ మనస్సులో లోతుల్లో కలిగించగల ప్రకంపనలు, స్పందనల ప్రభావం తెలిసిన కవుల సృజనకు చక్కని నిదర్శనం. ఈ భావనలను వ్యక్తం చేయటానికి, ఈ పదాలు కవుల మనస్సులలో స్ఫురింపచేసే భావావేశం కలిగించేందుకు వారి అంతరంగ స్పందనలు కారణమయినా, ఆ స్పందనలు కలిగించే ప్రేరణ అవసరం. ఈ ప్రేరణ ఒకో కళాకారుడికి ఒకో రకం. ఏది అయినా అంతరంగంలో సున్నితత్వం, భావుకతలుండాలి. దానికి శబ్ద ఐశ్వర్యం తోడవాలి. అంత సున్నితత్వం, భావుకతలు లేని సామాన్య జనులకు ఇదంతా పిచ్చితనంలా తోస్తుంది .'నవరంగ్'

సినిమాలో ఊహా సుందరి మోహిని లేని నాయకుడు పిచ్చివాడయితే, సజీవ శిల్ప సుందరి అగ్నికి ఆహుతయితే కళాకారుడు పిచ్చివాడవుతాడు, 'పునర్జన్మ' సినిమాలో. కారణం ఏదయినా ఫలితం ఒక్కటే.

'నవరంగ్' సినిమాలో నాయకుడు 'తూ ఛు పీ హై కహా ' అని తన ఊహా సుందరిని ప్రశ్నిస్తాడు. దానికి ఆమె సమాధానం కవుల  అంతరంగాన్ని తేటతెల్లం చేస్తుంది.

మై ఛుపీహు పియా తేరి కణ్ కణ్ మే

తేరి ధడ్ కన్ మే

తేరె హర్ సాంస్‌మే, తేరి హర్ ఆస్ మే

మై ఛుపీ హు కహా, మేరి యే రాజ్ సున్

దర్ద్‌కీ హోథోం గం సే భరా యే సాజ్‌సున్

మెరె రౌందే హువే  దిల్‌కీ ఆవాజ్ సున్

ఇంత గొప్పగా కవికీ, సృజనకూ, ప్రేరణకూ నడుమ ఉన్న విడదీయరాని అవినాభావ  సంబంధాన్ని వివరించిన మరో సినిమా పాటలేదు.

నీకై మేలుకొనిన

సర్వేంద్రియాలతో

ఏది రచిస్తున్నానో, చూస్తున్నానో

ఊపిరి తీస్తున్నానో

నిర్వికల్ప సమాధిలో

నా ప్రాణం నిర్వాణం పొందిందో,

అటు నను మంత్రించిన

సమ్మోధం గావించిన ఆ గాంధర్వానికి

తారా నిహవపు ప్రేమ సమాగమంలో

జనించిన సంగీతానికి...

నా నాడుల తీగలపై సాగిన

నాద బ్రహ్మపు పరిచుంబనలో

ప్రాణావసాన వేళా జనితం

నానాగానానూనస్వానావళితం..

'తూ ఛుపీ హై కహా పాటలో కవిత్వం, సృజనాత్మక శక్తి, ప్రేరణ కవికి తాను అతనిలో ఎక్కడ దాగున్నానో చెప్తోంది. 'కవితా ఓ కవితా 'లో శ్రీ శ్రీ కవిత కోసం, సృజనాత్మక ప్రేరణ కోసం తాను అన్వేషిస్తే ఆ కవిత తనలో ఎక్కడ ఎలా లభించిందో, ఎలా ఓ ప్రవాహంలా వెలువడిన కవిత తనకెన్నెన్ని అనుభూతులను కలిగించి, బ్రహ్మానంద సమాధి స్థితి అనుభవాన్ని ఎలా ఇచ్చిందో చెప్తున్నాడు.

'నేను నీ కణకణంలో దాగున్నాను. నీ హృదయ స్పందనలో ఉన్నాను. నీ ప్రతి ఊపిరిలో ఉన్నాను. నీ అభిలాషలో ఉన్నాను. నేను నీలో ఎక్కడ దాక్కున్నానో ఆ రహస్యం చెప్తాను విను. వేదనా భరితమూ, శోకతప్తమయమయిన ఈ రాగం విను. అణచి వేతకు గురయిన నా హృదయ స్పందన విను' అంటోంది అతని సృజనాత్మకతకు ప్రేరణ .

'కవితా ఓ కవితా 'లో శ్రీశ్రీ

నీ ప్రాబల్యంలో,

చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణలో,

నిశ్చల సమాధిలో

స్వర్గ ద్వారపు తోరణమై వ్రాలిన  నా

మస్తిష్కంలో

ఏయే హోషలు, భాషలు, దృశ్యాల్ తోచాయో?

నేనే చిత్ర విచిత్ర శ్యమంత

రోచిర్నవహం చూశానో!

నా గీతం ఏయే శక్తులతో ప్రాణ స్పందన పొందిందో.?

అంటూ చెప్పినదంతా కవి దృష్టిలో. హిందీ సినిమా పాటలో కవి అంతరంగంలో ఒదిగిన సృజన శక్తి దృక్కోణంలో చెప్తుంది.

అంటే, సృజన శక్తి కవి అణువణువులో, ఊపిరి, అతని అంతరంగంలో, అతనిలోనే నిక్షిప్తమై ఉందన్నమాట. ఆ అంతరంగపు శక్తికి ప్రేరణనిస్తే చాలు కవిత 'వడివడిగా వెలువడినై, పరుగిడినై, నా యెద నడుగిడినై ' అంటాడు కవి.

'నవరంగ్'లో అంతవరకూ జీవితంలో ఆనందం పోయిందని, తన సృజనాత్మక స్రవంతి ఎండిపోయిందని రోదిస్తున్న కవి మోహిని  గజ్జెల శబ్దం విని ఉన్మత్తుడవుతాడు. ఆ శబ్దం అతనిలో కలిగించిన స్పందనలు అతడిలోని కవిని జాగృతుడిని చేస్తాయి.

యె కౌన్ ఘుంఘ్రు ఝునకా, యే కౌన్ చాంద్ చంకా

యే ధర్తీ సే అస్మాన్ ఆగయా పూనంకా

యే కోన్ ఫూల్ మెహకా, యే కౌన్ పంచి  చెహకా

మహఫిల్ మె ఏక్ ఖుశ్బు ఉడీ, దిల్  జో మేరా బహెకా

**లో తనమె జాన్ ఆయా, హోఠోం పె తాన్ ఆయా**

**మెరి చకోరి చాంద్ నీ మె కర్‌కె స్నాన్ అయి**

**బిఛ్డా వో మీత్ అయా, జీవన్ క్ గీత్ ఆయా**

**దో ఆత్మవోంకె మిలన్ దిన్ పునీత్ ఆయా**

**సూరత్ హై సప్నోంకి తూ సోహినీ**

**జమునా తూహీహై తూహి మెరీ మోహినీ...**

'నవరంగ్' సినిమాలోని ఈ పాట వింటూంటే శ్రీశ్రీ కవిత 'కవితా ఓ కవితా' గుర్తుకురాకమానదు. ఆ రెంటిలో కవి తన ప్రేరణకోసం, తద్వారా తనలోంచి వెలువడే కవిత కోసం అన్వేషిస్తున్నాడు. దృష్టి వేరు. చెప్పేది ఒకటే. భాష వేరు. భావం ఒకటే, వ్యక్తీకరణ వేరు. వ్యక్తమైనది ఒకటే. ప్రపంచంలో, ప్రజలు ఏ సంస్కృతి, ఏ భాషకు చెందినవారయినా సృజనాత్మకత ఒకటే. అది విశ్వసృష్టికారుడి అనంత సృజనను బిందుమాత్రంలో ప్రదర్శించేదే.

ఆమె గజ్జెలు ఘల్లుమనే శబ్దం వినిపించగానే, కవి హృదయంలో చంద్రుడు మెరిశాడు. భూమిపై వెన్నెల నిండిన పౌర్ణమి నాటి ఆకాశం విరిసింది. (ఇది చాలా తాత్వికమైన వ్యక్తీకరణ) పూలు విరిసాయి. పక్షులు కలకలలాడాయి. ప్రపంచంలో పరిమళం విస్తరించింది. అతని హృదయం స్పందించింది. అతని శరీరంలో ప్రాణం కదిలింది. పెదవులపై కవిత మెరిసింది. ఆయన ఎదురు చూస్తున్న చకోరం వెన్నెలలో స్నానం చేసి వచ్చింది. అతడిని వదిలి వెళ్లిన ప్రేయసి తిరిగి వచ్చింది. అతని జీవన గీతం జాగృతం అయింది. రెండు ఆత్మలు కలిసే పవిత్రమైన రోజు వచ్చింది. ఆమెనే తన జమున. జమునే తన మోహిని. మోహినే తన కవితకు ప్రాణం. జమున తన మోహినికి ప్రాణం.. జమున అతని జీవితానికి ప్రాణం అయితే, జమున ప్రేరణతో ప్రాణం పోసుకునే మోహిని అతని సృజనాత్మక జీవితానికి ప్రాణం. ఇది కళాకారుడి అంతరంగ కథ.

తన నుండి సృజనాత్మక శక్తి కవితా రూపంలో బహిర్గతమయ్యేందుకు కళాకారుడు చేసే తపస్సు, అనుభవించే వేదనకు ప్రతిరూపం.

**నీకై బ్రతుకే ఒక తపమై**

వెదుకాడే నిమిషాలందున నిషాలందున

ఎటునే చూచిన చటులాలంకారపు

మటు మాయల నటనలలో,

నీ రూపం కానరానందున

నా గుహలో, కుటిలో, చీకటిలో

ఒక్కడినై స్రుక్కిన రోజులు లేవా?

అని కవితకోసం లేక అన్వేషణను శ్రీశ్రీ వ్యక్తపరచాడు. ఆ వేదన ప్రతిధ్వని నవరంగ్‌లో కవి తన కవితకు ప్రేరణ అయిన మోహిని కోసం అన్వేషణలో ప్రతిఫలించింది.

'దో ఆత్మవోంక  మిలన్ దిన్ పునీత్ ఆయా '. ఆకాశం, భూమి కలవటం, రెండు ఆత్మలు కలవటం, ఆకాశం దిగి భూమిపైకి రావటం అన్నది అత్యంత ప్రతీకాత్మక భావ వ్యక్తీకరణకు చక్కటి సాధనాలు.

సృజనాత్మక శక్తి సరస్వతి. సరస్వతి ఉండేది బ్రహ్మలోకంలో. ఆ శక్తి దిగి భూమిపైకి వచ్చి మనిషిలో ప్రకటితమౌతుంది. ఆ శక్తి తన ద్వారా ప్రకటితమయ్యేందుకు వ్యక్తి తపస్సు చేయాలి. శోధించాలి. అంతరంగ మథనం సాగాలి. అప్పుడు ఆకాశంలోని  శక్తిని భరించే స్థితి వస్తుంది మనిషి మనసు . అప్పుడు వెన్నెల నిండిన ఆకాశంలోని కిరణాలు భూమిపైకి వస్తాయి.  అతడిలో కవితాశక్తి జాగృతమవుతుంది .కవిత ప్రకటితమౌతుంది. వెన్నెల నిండిన ఆకాశం సృజనాత్మక శక్తి కి ప్రతీక.  సృజన శక్తి, మానవ ఆత్మతో కలసిన  అపురూపమైన స్థితి అది. అది భూమిపై వెన్నెల నిండిన ఆకాశం వచ్చిందన్నా, రెండు ఆత్మల కలయిక  సంభవించే పవిత్రమైన దినం అన్నా ఈ భావం వెనక దాగిన తాత్విక ఆలోచనలకు అక్షర రూపాలే. ఉత్తమ స్పందనల  ప్రేరణ ద్వారా వెలువడే కవిత అత్యుత్తమం. అది సామాన్యులలోని నిద్రాణ సృజనాత్మక  శక్తిని జాగృతం చేసి వారిని ఉన్నతులను చేస్తుంది. అందుకు భరత్ వ్యాస్ పాటలు చక్కటి నిదర్శనాలు.

(మరిన్ని పాటలతో వచ్చేనెల కలుద్దాం...)

Click here to share your comments